RK అగ్నిన్యూస్
The Power Of Truth
9441533080 - 8309890844

జనవరి: 12 ఆదివారం సంపుటి : 29 సంచిక : 10




సంక్రాంతి పండుగ కానుకగా

## బకాయిలు చెల్లిస్తున్నాం – సీఎం

(అగ్ని ప్రతినిధి,విజయవాడ)

సంక్రాంతి సందర్భంగా వివిధ శాఖలకు చెల్లించాల్సిన బకాయిలను విడుదల చేస్తున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలిపారు.ఉండవల్లి నివాసంలో నిర్వహించిన సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. ఉద్యోగులకు జీపీఎఫ్ పెండింగ్ బిల్లులు రూ.519 కోట్లు, పోలీసులకు సరెండర్ లీవ్ బకాయిలు రూ.214 కోట్లు,సీపీఎస్‌కు సంబంధించిన రూ.300 కోట్లు, టీడీఎస్ కింద పెండింగ్ బిల్లులు రూ.265 కోట్లు,ఉద్యోగులకు మొత్తం రూ.1,300 కోట్లు,విద్యార్థుల ఫీజురీయింబర్స్ బకాయిలు రూ.788 కోట్లు,చిన్న కాంట్రాక్టర్ల బిల్లులు రూ.586 కోట్లు,అమరావతి రైతుల కౌలు బకాయిలు రూ.241 కోట్లు చెల్లిస్తున్నామన్నారు.6 వేల మంది చిరువ్యాపారులకు రూ.వంద కోట్లు, ఎన్టీఆర్ వైద్యసేవకు రూ.500 కోట్లు, విద్యుత్‌శాఖకు రూ.500 కోట్లు విడుదల చేస్తున్నాం అని తెలిపారు.

కార్యకర్తను పరామర్శించిన

## ఎమ్మెల్యే ముత్తుముల



అగ్నిన్యూస్,రాచర్ల (జనవరి 11)

మండలం లోని ఫారం గ్రామంలో ఆనారోగ్యంతో బాధపడుతూ విశ్రాంతి తీసుకొనుచున్న టిడిపి కార్యకర్త దూదేకుల ఖాసీంను, గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి శనివారం వారి నివాసానికి వెళ్లి పరామర్శించారు. వారితో కాసేపు మాట్లాడి ఆరోగ్య పరిస్థితిని గురించి అడిగి తెలుసుకుని తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఎమ్మెల్యే తో పాటు మండల నాయకులు కూడా పాల్గోని వారిని పరామర్శించారు.

శ్రీకృష్ణ సేవాసమితి ఆధ్వర్యంలో

## పేద విద్యార్థులకు ఆర్థిక సహాయం

- శ్రీకృష్ణ సేవాసమితి నూతన క్యాలెండర్ ఆవిష్కరించిన డియస్పీ నాగరాజు

అగ్నిన్యూస్,మార్కాపురం (జనవరి11)

పట్టణంలో శ్రీకృష్ణ సేవ సమితి ఆధ్వర్యంలో శనివారం శ్రీకృష్ణ సేవా సమితి ప్రతినిధులు అడక రాజగోపాల్ ఆధ్వర్యంలో ఇరిగేషన్ డిఈ నాగశేషు నివాసంలో సేవా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మార్కాపురం డి.ఎస్.పి యు.నాగరాజు హాజరయ్యారు. ఈ సందర్భంగా డి ఎస్ పి మాట్లాడుతూ గత నాలుగు సంవత్సరాలుగా పేద







విద్యార్థులకు ఆర్థిక సహాయం చేయడం, నిత్యవసర సరుకులు పంపిణీ చేయడం అభినందనీయమని శ్రీకృష్ణ సేవా సమితి ప్రతినిధులను అభినందించారు. ఈ కార్యక్రమానికి నేను కూడా పాల్గొనడం చాలా సంతోషకరమని తెలిపారు. అడక రాజగోపాల్ మాట్లాడుతూ పలువురు శ్రీకృష్ణ సేవ సమితి కమిటీ సభ్యులు సహకారంతో తల్లి లేదా తండ్రి కోల్పోయిన విద్యార్థులకు ఆర్థికంగా వెనుకబడి చదువుకోడానికి ఇబ్బంది పడుతున్న వారిని పలువురిని గుర్తించి 5000 చొప్పున ఆర్థిక సహాయం చేయడం జరుగుతుందని తెలిపారు. గుమ్మ శిరీష, నాలి అశోక్, పల్లెబోయిన నాగమల్లేశ్వరి లకు ఆర్థిక సాయం అందించారు. వృద్ధులకు దుప్పట్లు పంపిణీ అలానే పేదలకి సంక్రాంతి పండుగ సరుకులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ డి ఈ నాగ శేషు, వెటర్నరీ డాక్టర్ రమేష్, శ్రీరాములు, గోను సుబ్బారావు, ఎక్సైజ్ శాఖ అధికారి రాధాకృష్ణ, గొర్రెల మండే అధ్యక్షులు బలయ్య, మాజీ ఎంపీపీ బాల గురవయ్య, దోర్నాల ఎంపీపీ గుమ్మ పద్మజ ఎల్లేష్, గుమ్మ రాజగోపాల్, పి లక్ష్మీనారాయణ, కాయకాకుల వెంకటేశ్వర్లు, గుమ్మ నాగార్జున, గుమ్మ అంకయ్య, బోరి గొర్ల గాలయ్య, అమరయ్య, మాజీ సర్పంచ్ నంబుల లక్ష్మయ్య, పిన్నిక శివ,ఓ.రామాంజనేయులు, లక్ష్మీనారాయణ,తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ ఇన్చార్జి ఎరిక్షన్ బాబును కలిసిన

## ఈఓ రజని కుమారి




అగ్నిన్యూస్,యర్రగొండపాలెం ( జనవరి 11)

త్రిపురాంతకం లోని శ్రీ పార్వతి సమేత త్రిపురాంతకేశ్వర స్వామి, శ్రీ బాల త్రిపురసుందరీ దేవి అమ్మవారి ఆలయాల నూతన కార్యనిర్వహణాధికారిగా బాధ్యతలు తీసుకున్న డి రజిని కుమారి శనివారం యర్రగొండపాలెం నియోజకవర్గ టీడీపీ ఇంచార్జ్ గూడూరి ఎరిక్షన్ బాబు ని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆలయానికి వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా, ఆలయ అభివృద్ధికి తమవంతు కృషి చేయాలని ఎరిక్షన్ బాబు సూచించారు. ఆలయాల పరిసరాలను శుభ్రంగా ఉంచడం, భక్తుల మనోభావాలకు ఇబ్బంది లేకుండా చూడడం పట్ల శ్రద్ధ వహించాలని ఎరిక్షన్‌బాబు, ఈఓ రజనీ కుమారికి సూచించారు.

## కోడి పందాలు నిర్వహిస్తే కఠిన చర్యలు – ఎస్పీ దామోదర్




అగ్నిన్యూస్,ఒంగోలు (జనవరి 11): సంక్రాంతి పండగను పురస్కరించుకొని జిల్లాలో ఎక్కడైనా కోడి పందాలు,పేకాట వంటి జూదాలు నిర్వహించడం నిషేధమని, ఎవరైనా కోడి పందేలు, జూదాలు ఆడినా, ప్రోత్సహించినా,సాంప్రదాయ క్రీడల పేరుతో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ దామోదర్ హెచ్చరించారు. సంక్రాంతి పండుగ నేపథ్యంలో సాంప్రదాయం క్రీడలు అయిన కబడ్డి, కోకో, బ్యాడ్మింటన్,వాలీబాల్, ఫుట్ బాల్, క్రికెట్ మొదలగు క్రీడలు నిర్వహించుకోవాలని, పండగలను కుటుంబ సభ్యులతో ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని సూచించారు.శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ గతంలో కోడి పందేలు, జూదాలు ఆడుతూ పట్టుబడిన వ్యక్తులను బైండోవరు చేయాలన్నారు. పండగ రోజులలో కోడి పందేలు జరిగే వీలున్న ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు.ఎవరైనా జిల్లాలో కోడి పందేలు నిర్వహించినా, పందేలు నిర్వహణకు స్థలాలు, భూములు ఇచ్చిన, జూద క్రీడలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆకస్మిక తనిఖీ



అగ్నిన్యూస్,పెద్దారవీడు(జనవరి11): ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శనివారం జిల్లా క్షయ వ్యాధి నివారణ అధికారి డాక్టర్ సురేష్ ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. అనంతరం ఎన్ సి డి సర్వే, టిబి కేసుల రివ్యూ నిర్వహించారు. ఎన్ సి డి సర్వే త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించినారు. అదేవిధంగా ప్రతి గ్రామంలోనూ ఫీవర్ సర్వే చేసి జ్వర పీడితులను గుర్తించి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి పంపించే విధంగా చూడాలని అన్నారు. అనంతరం రికార్డులు తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తపరిచినారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ జగదీష్, సిహెచ్ఓ హరినాథ్, హెల్త్ సూపర్వైజర్ సుభాని పాల్గొన్నారు.

## మైనర్లకు వాహనాలు ఇస్తే కఠిన చర్యలు

### సిఐ సురేష్



అగ్నిన్యూస్,గిద్దలూరు(జనవరి11): మైనర్లకు వాహనాలు ఇస్తే వాహన యజమానిపై కఠిన చర్యలు తీసుకుంటామని గిద్దలూరు అర్బన్ సిఐ సురేష్ తీవ్రంగా హెచ్చరించారు.సంక్రాంతి పండుగను అందరూ సుఖ సంతోషాలతో జరుపుకోవాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. సంక్రాంతి సందర్భంగా దూరప్రాంతాలలో చదివే విద్యార్థులు పండగకు తమ ప్రాంతాలకు వస్తుంటారని ఇదే అదునుగా మైనర్లు వాహనాలు తీసుకొని రోడ్డుపై విచ్చలవిడిగా తిరుగుతుంటారని అటువంటివారిని గుర్తిస్తే ఉపేక్షించేది లేదని సిఐ సురేష్ అన్నారు. తల్లిదండ్రులు మీ మైనర్ పిల్లలకు ద్విచక్ర వాహనాలు లేదా ఇతర వాహనాలు ఇవ్వరాదని అన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే వాహనాలు సీజ్ చేయడంతో పాటు వాహన సంబంధిత యజమానిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

## పండగలకు ఊర్లకు వెళ్లే ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

### ఎస్ఐ వి మహేష్




అగ్నిన్యూస్,పెద్ద దోర్నాల (జనవరి 11): పెద్ద దోర్నాల పోలీస్ స్టేషన్ పరిధిలోని మండలంలోఅన్ని గ్రామాల,వట్టణముల సంక్రాంతి పండుగకు ఊర్లకు వెళ్లే ప్రయాణికులు ఎవరైనా ఉన్నాయెడల స్థానిక పోలీస్ స్టేషన్ నందు సమాచారం ఇస్తే ఆ ప్రాంతాలలో బీట్ ఏర్పాటు చేసి పోలీసులతో పెట్రోలింగ్ ఏర్పాటు చేయడం జరుగుతుందని దోర్నాల ఎస్సై వి మహేష్ ఒక ప్రకటనలో తెలిపారు. అదేవిధంగా అవసరమైన మేరకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకున్న ఎడల వారికి భద్రత పరంగా ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని ఆయన తెలిపారు. కనుక ప్రజలు ఈ విషయాన్ని గమనించి ఈ యొక్క అవకాశాన్ని వినియోగించుకొని ఎటువంటి ఇబ్బందులకు గురికాకుండా ఉండవలెనని ఆయన కోరారు.

## కిట్స్ ఇంజనీరింగ్ కళాశాల లో ...,

# అంబరాన్ని అంటిన సంక్రాంతి సంబరాలు





అగ్నిన్యూస్,మార్కాపురం (జనవరి 11)

స్థానిక కిట్స్ ఇంజనీరింగ్ కళాశాల లో సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించినట్లు కళాశాల సెక్రటరీ అన్నా కృష్ణ చైతన్య తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మన్ అన్నా వెంకట రాంబాబు, దుర్గా కుమారి, కళాశాల సెక్రటరీ అన్నా కృష్ణ చైతన్య, అనూష లు పాల్గొన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి అత్యంత ముఖ్యమైన పండుగ సంక్రాంతి సందర్భంగా విద్యార్థులు, సిబ్బంది ఉత్సాహంతో పాల్గొని ఈ వేడుకలను విజయవంతంగా పూర్తి చేశారు. ఈ ఉత్సవాల్లో ప్రధాన ఆకర్షణలుగా కిట్స్ ఫ్లైయింగ్ హార్వెస్టింగ్, విద్యార్థులు, సిబ్బంది గాలిపటాలను ఎగరవేస్తూ ఐక్యత, ఆశయాలు, పండుగ ఆనందాన్ని పంచుకున్నారు. పాల పొంగణం కార్యక్రమం ద్వారా శుభారంభం, ఐశ్వర్యానికి సూచికగా ఈ సాంప్రదాయ కార్యక్రమం నిర్వహించబడింది. రంగోలి పోటీలలో విద్యార్థులు అద్భుతమైన రంగోలి డిజైన్లతో తమ సృజనాత్మకతను ప్రదర్శించారు. పండుగ వాతావరణాన్ని మరింత అందంగా మార్చారు. హరిదాసు వేషధారణలో కొందరు విద్యార్థులు హరిదాసు వేషధారణలో పాల్గొని సంక్రాంతి సంప్రదాయాన్ని ప్రతిబింబించారు. అలాగే సాంస్కృతిక ప్రదర్శనలు జానపద నృత్యాలు, సంగీతం, నాటకాలతో విద్యార్థులు ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. వివిధ పోటీల్లో విద్యార్థులు చురుకుగా పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. విద్యార్థులు, సిబ్బంది చూపిన చురుకుదనానికి, కృషికి మేనేజ్మెంట్ ప్రత్యేకంగా అభినందనలు తెలియజేసింది. ఈ వేడుకలు మన సంస్కృతి వైభవాన్ని పునరుద్ధరించడంలో, విద్యార్థులు తమ మూలాలను గుర్తు చేసుకోవడంలో ముఖ్య పాత్ర పోషించాయి. సంక్రాంతి సందర్భంగా విద్యార్థులు, తల్లిదండ్రులు,సిబ్బంది, శ్రేయోభిలాషులకు కిట్స్ తరపున హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ వి కృష్ణారెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ.రంగనాయకులు, కళాశాల ఏవో బి ప్రభాకర్, వివిధ విభాగపు అధిపతులు పి రామ్మోహన్, డాక్టర్ జెవి అనిల్ కుమార్, కే రాముడు, కే కిషోర్ బాబు, ప్రసన్న మురళి , జే రమణారెడ్డి, ఏ. అమృతవల్లి , పి మనోహర్, ఫిజికల్ డైరెక్టర్స్ ఎన్ రంగస్వామి, ఎన్ వి ఎస్ ఎన్ అంజనీ కుమార్, ఉపాధ్యాయ ఉపాధ్యాయేతర సిబ్బంది, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## ఘనంగా ముగిసిన సామూహిక విష్ణు సహస్రనామ పారాయణం




అగ్నిన్యూస్,మార్కాపురం (జనవరి 11)

స్థానిక నెహ్రూ బజార్ శ్రీ శిరిడి సాయిబాబా మందిరంలో ధనుర్మాసం సందర్భంగా డిసెంబర్ 31 నుండి జనవరి 10వ తారీఖు వరకు నిర్వహించిన సామూహిక విష్ణు సహస్రనామ పారాయణం ఘనంగా ముగిసింది. సుమారు 350 మంది 11 రోజులు కోటి 25 లక్షల విష్ణు సహస్రనామ పారాయణ చేశారు. ముగింపు తదుపరి 11వ తేదీ శనివారం లక్ష్మీనారాయణ హోమం మందిర పూజారులు వేదాల రామకృష్ణచార్యులు,రవి శంకర్ శర్మ లు వేదసూక్తంగా నిర్వహించారు. హోమం వద్ద గోపాలుని కృష్ణమోహన్, పాలగిరి వెంకటేశ్వర్లు, రాజశేఖర్ రెడ్డి లు పాల్గొన్నారు. విష్ణు సహస్రనామ పారాయణం అత్యధికంగా పారాయణం చేసిన యక్కలి సరోజ కు ప్రథమ బహుమతి, పాదర్తి కనక సుబ్బులు కు ద్వితీయ బహుమతి, పేరం సీతారావమ్మ కు తృతీయ బహుమతిగా వెండి కాయిన్స్ మందిర అధ్యక్షులు పేరం సత్యనారాయణ బహుకరించారు. బాబా మందిరంలో ఈనెల 13వ తేదీ భోగి పండుగ రోజు శివకోటి సందర్భంగా శివాలయంలో శివునికి ఉత్తర ద్వార దర్శనం ఏర్పాటు చేశామని అందరూ పాల్గొనాలని, అలాగే ఈనెల 14వ తేదీ సంక్రాంతి పర్వదిన సందర్భంగా సుమారు 800 మంది బీదలకు దుప్పట్ల పంపిణీ చేస్తున్నట్లుగా మందిర కార్యదర్శి గోపాలుని హరి హర రావు తెలిపారు. ఈ కార్యక్రమములో కోశాధికారి పి వి ఎల్ ఎన్ వి నాగరాజు, ఉపాధ్యక్షులు రాముడుగు వెంకట నాగ గోపి, అదనపు కార్యదర్శి చల్లా పవన్, షేక్ కరీం భాషా,కమిటీ సభ్యులు గూటూరి రంగ ప్రసాద్, ధూళిపాళ్ల మధుసూదన్ రావు, సాయి సుబ్బారావు, సూరే నాగేశ్వరరావు మహిళా సంఘ అధ్యక్ష కార్యదర్శులు బొంతల భారతి, తటవర్తి వరలక్ష్మి, మహిళా సంఘ సభ్యులు యువజన కార్యకర్తలు పాల్గొన్నారు. అనంతరం సుమారు 300 మందికి అన్నదాన కార్యక్రమం నిర్వహించినారు. మందిర మేనేజర్ సతీష్ నాయుడు కార్యక్రమాలను పర్యవేక్షించారు.

# భారతీయ యువతకు ఆయన రోల్ మోడల్... !

## (నేడు స్వామి వివేకానంద జయంతి)



**సు**సంపన్నంగా విరాజిల్లవలసిన మన దేశం బ్రిటిష్ వారి కబంధ హస్తాల్లో నలిగిపోతున్న రోజులవి, భారతీయులంతా నిరాశ నిస్పృహల చీకట్లలో బ్రతుకున్న కాలమది. అదిగో అలాంటి సమయంలో సూర్యుడు సరికొత్త రూపంలో కలకత్తా లో ఉదయించాడు. భయమంటే తెలియని కళ్ళు, తేజస్సుతో నిండిపోయిన మొఖం , గంభీరమైన గొంతు, బలిష్టమైన శరీరం, దేశ భక్తికి నిలువెత్తు రూపం ఆయనే స్వామి వివేకానంద. కుల, మత, జాతి, లింగ బేధాలు లేకుండా ప్రతి ఒక్కరికి ఆదర్శం ఆయన. ఇండియాలోని యువతకు రోల్ మోడల్.

భారతదేశం యొక్క అత్యంత ప్రసిద్ధ ఆధ్యాత్మిక నాయకులు, దేశ భక్తుడు, మాటలతో మంత్రముగ్దులను చెయ్యగలిగే గొప్ప వక్త. బ్రతికింది కేవలం 39 సంవత్సరాలే కానీ మరొక 1000 సంవత్సరాలు గడిచిన కూడా చెరిగిపోని ముద్ర వేశారు. అలాంటి మహనీయుడి గురించి, ఆయన జీవితం లో ఎదుర్కొన్న కష్టాల గురించి, భారతదేశపు గొప్పతనాన్ని ప్రపంచమంతా ఎలా చాటారో ఇప్పుడు తెలుసుకుందాం.

స్వామి వివేకానంద 1863 సంవత్సరం జనవరి 12 తేదీన మకర సంక్రాతి రోజున ఒక బెంగాలీ కుటుంబంలో కలకత్తాలో జన్మించారు. ఆయన తండ్రి న్యాయవాదిగా పనిచేసేవారు. స్వామి వివేకానంద చిన్ననాటి పేరు నరేంద్ర నాథ్ దత్తా. 1871 లో తన ఎనిమిదవ ఏట నరేంద్రుడు ఈశ్వర చంద్ర విద్యా సాగర్ మెట్రో పొలిటన్ పాటశాలలో చేరాడు. చిన్న వయసులోనే ఎన్నో పాశ్చ్యాత , తత్వ శాస్త్ర గ్రంధాలు , నవలలు, చరిత్రలు, అన్ని మతాల గ్రంధాలు, ఇలా ఎన్నో చదివేశాడు. అసలు ఇంత చిన్న వయసులో అది ఎలా సాధ్యం అయ్యింది అని అడుగగా స్వామి వివేకానంద ఇలా అన్నారు ... నేను ఒక పేరా మొత్తం చదవను పేరాలోని మొదటి మరియు చివరి లైన్ లు చదివితే చాలు మొత్తం పేరా అంత అర్ధమయ్యిపోతుంది" అంటారు.

యువకుడిగా ఉన్నప్పటి నుండి కూడా భగవంతుడు అనే వాడు ఒకడు ఉంటె ఎలాగైనా ఆయన్ని ఖచ్చితంగా చూడాలని నిర్ణయించుకున్నాడు. ఎవరైనా పెద్దవాళ్ళు, గొప్పవాళ్ళు కనిపిస్తే మీరు భగవంతుడిని చూసారా ? అని అడిగేవాడు. దేవుణ్ణి చూశామని సమాధానం ఇచ్చిన వారు ఎవరూ లేరు. ఒకరోజు ప్రిన్సిపాల్ అయినటువంటి విలియం హేస్టీ పాఠం చెప్తూ "పారవశ్యం" అనే పదాన్ని వివరించాలనుకుంటాడు. కానీ అది ఆయనకు సాధ్యం కాదు. అప్పుడు ఆయన ఈ పదానికి అర్ధం తెలియాలంటే దక్షిణేశ్వర్ లో ఉండే శ్రీరామకృష్ణ పరమహంస గురించి చెప్పి ఆయనను కలవమని చెప్పారు. అలా ఆ పదానికి అర్ధం తెలుసుకోవడానికి నరేంద్రుడు దక్షిణేశ్వర్ కి వెళ్ళాడు. అక్కడ రామకృష్ణ పరమహంస ను కూడా మీరు దేవుణ్ణి కళ్లారా చూసారా? అని అడుగుతాడు.అప్పుడు పరమహంస అవును చూసాను.!నిన్ను ఎలాచూస్తున్నానో నీతో ఎలా మాట్లాడుతున్నానో అలాగే భగవంతుని కూడా చూశానని భగవంతుమితో మాట్లాడానని ఆయన అన్నారు. మొట్టమొదటిసారి ఒక వ్యక్తి దేవుడిని చూసాను అని చెప్పేసరికి నరేంద్రుడు ఆశర్య పోయాడు.

**స్వామి వివేకానంద సూక్తులు:** అయితే నరేంద్రుడు ఎక్కడో చదివాడు కాబట్టి లేదా ఎవరో చెప్పారు కాబట్టి దేనిని సులువుగా నమ్మేవాడు కాదు. తనకు తానూ ప్రత్యక్షంగా అనుభూతి చెందితే తప్ప దేనిని నమ్మడు . అప్పుడు నరేంద్రుడు అయితే నాకు కూడా దేవునికి చూపించండి అంటాడు. అప్పుడు రామకృష్ణులు ఆయన కాలును మెల్లగా నరేంద్రుడి ఒడిలో ఉంచారు.మరుక్షణం నరేంద్రుడికి బాహ్యాప్రపంచంతో సంబంధాలు తెగిపోయాయి. ఆయనకేదో అయిపోతున్నట్లుగా అనిపించసాగింది. నన్నేమి చేస్తున్నారు ? నా తల్లిదండ్రులు ఇంకా బతికే ఉన్నారు. నేను మళ్ళీ వారి దగ్గరకు వెళ్ళాలి. అని అరిచాడు. అప్పుడు రామకృష్ణుల వారు చిరునవ్వు నవ్వుతూ ఈరోజుకిది చాలు అని చెప్పి తన కాలును వెనక్కి తీసేసుకున్నారు. ఇలా రామకృష్ణుల సన్నిధిలో ఎన్నో అద్భుతాలను నరేంద్రుడు చూసాడు. దానితో నరేంద్రుడు రామకృష్ణ పరమహంసకు శిష్యునిగా చేరాడు. ఆయన దగ్గర నుండి ఎన్నో విషయాలు నేర్చుకున్నాడు. అలా చదువుకుంటూనే మెల్లగా సన్యాస మార్గంలోకి నడిచాడు.

1884లో బి.ఎ పాస్ అయిన సందర్భంగా స్నేహితులతో పార్టీ చేసుకుంటున్న సమయంలో ఒక్కసారిగా నరేంద్రుడి తండ్రి గారు మరణిచారనే వార్త తెలుస్తుంది. తండ్రి మరణంతో కుటుంబం పేదరికంలోకి వెళ్ళిపోతుంది. అప్పులిచ్చిన వాళ్ళు, వాళ్ళ దగ్గరి బంధువులు కలిసి నరేంద్రుడి ఆస్తులను లాక్కుంటారు. ఇంట్లో తినడానికి తిండి కూడా ఉండేది కాదు. తల్లికి, చెల్లెళ్ళకు, తమ్ముళ్ళకు తిండి పెట్టడంకోసం ఉద్యోగం కోసం వెతుకుంటూ ఉండేవాడు. కుళాయి నీళ్లు తాగి కడుపు నింపుకునేవాడు. ఇంటికి వచ్చిన తరువాత తాను స్నేహితుల ఇంట్లో తిన్నానని అబద్దం చెప్పి తన కోసం ఉంచిన ఆహారాన్ని చెల్లెలకు ఇచ్చేసేవాడు. ఉద్యోగం కోసం తిరుగుతూ ఆకలితో ఎన్నో సార్లు కళ్ళు తిరిగి రోడ్ల మీద పడిపోయేవాడు. చివరికి ఒక పాఠశాలలో ఉపాధ్యాయ వృత్తి దొరుకుతుంది. కొంతకాలానికి రామకృష్ణ పరమహంస కు గొంతు క్యాన్సర్ సోకడంతో ఆరోగ్యం క్షీణించింది. దాంతో నరేంద్రుడు ఉద్యోగం మానేసి గురువు గారికి సేవ చెయ్యనికి వెళ్ళిపోయాడు. కానీ 1886 లో రామకృష్ణ పరమహంస మరణించారు. రామకృష్ణులవారు చనిపోయిన తరువాత ఆయన శిష్యులందరూ కలిసి ఒక మఠాన్ని ఏర్పాటు చేసుకుని అందులో ఉండేవారు. వాళ్ళకి నరేంద్రుడు నాయకుడిగా ఉండేవారు. కొంతకాలం తరువాత వివేకానంద దేశమంతటా పర్యటించాలనుకున్నారు. భారతదేశమంతటా ప్రయాణించి భారతీయుల స్థితిగతులను ప్రత్యక్షంగా చూసారు.ఆ సమయంలో పేదవాళ్ళ పరిస్థితి చూసి చలించిపోయారు. భారత దేశం బానిసత్వం లో మగ్గిపోవడానికి, మూఢనమ్మకాలే కారణమని గుర్తించారు. భారతదేశంలోని వివిధ మతాలను వాటి తత్వాలలను అర్ధం చేసుకున్నారు.

భారతీయ ఆద్యాత్మిక సందేశాన్ని ఇతర దేశాలకు అందించాలనుకున్నారు. అలా దేశమంతా పర్యటిస్తూ చివరికి కన్యాకుమారి చేరుకున్నారు. అక్కడ సముద్రంలో కొంత దూరంలో కనపడుతున్న ఒక చిన్న కొండ లాంటి ప్రదేశానికి ఈదుకుంటూ వెళ్లి అక్కడ మూడు రోజుల పాటు ధ్యానం చేసారు. ఆ ధ్యానంలో తాను ఇన్ని రోజుల నుండి చుసిన వాటిని స్పష్టంగా అర్ధం చేసుకున్నారు. పాశాత్య దేశాలకు వెళ్లి భారతదేశపు గొప్పతన్నాని చాటాలని అలాగే తిరిగి వచ్చిన తరువాత నిరాశ నిస్పృహలతో నిండిపోయిన భారతీయులను మేల్కొలపాలని నిర్ణయించుకున్నారు. అయితే చికాగో లో జరగబోయే సర్వమత మహా సభలకు వెళ్లాలని, అక్కడ భారతదేశ గొప్పతన్నాని, ఆధ్యాత్మికను చాటి చెప్పాలనుకున్నారు. అయితే విదేశాలకు వెళ్ళడానికి కావలసిన డబ్బును కొంతమంది మహారాజులు సమకూర్చారు. దేశ నలుమూల నుండి ఎంతో మంది విరాళాలు పంపారు. అలా 1893 వ సంవత్సరం మే 31వ తేదీన బొంబాయి తీరం నుండి ఒక నౌకలో ఆయన బయలుదేరారు. జులై నెలలో ఆయన చికాగో చేరుకున్నారు. అయితే అక్కడకి వెళ్ళాక తెలిసింది సర్వ మత మహా సభలు 3 నెలలకు వాయిదా పడ్డాయని.

ఒక బ్రిటీష్ ఆఫీసర్ మరియు స్వామి వివేకానంద కలిసి ఒక ట్రైన్ లో ప్రయాణిస్తుంటారు. ఆ కంపార్ట్మెంట్ లో కేవలం వీరిద్దరే ఉన్నారు. స్వామిజి వేషధారణ చూసి ఆయనకు ఇంగ్లీష్ రాదనుకుని స్వామిజిని అపహాస్యం చేస్తూ ఉంటాడు. కొంతసేపటి తరువాత స్వామిజి నిద్రపోయారు. ఆ సమయంలో ఆ బ్రిటిష్ ఆఫీసర్ వివేకానంద షూస్ ని తీసి కిటికీ నుండి బయటకు విసిరేశాడు. వివేకానంద నిద్ర లేచి చూసేసరికి ఆయన షూస్ కనపడలేదు. స్వామిజికి అంతా అర్ధమయ్యింది. కానీ ఏమి మాట్లాడకుండా స్వామిజి నిశ్శబ్దంగా ఉన్నారు. కొంత సేపు గడిచాక ఈ బ్రిటిష్ ఆఫీసర్ నిద్రపోయాడు. కొంతసేపటి తరువాత ఆఫీసర్ లేచి చుస్తే హేంగర్ కి తగిలించి ఉండవలసిన తన కోట్ కనిపించలేదు. అప్పుడు ఆ ఆఫీసర్ నా కోట్ ఏది? అని స్వామి వివేకానంద ని అడిగితె అప్పుడు స్వామిజి "నీ కోట్ ని నా షూస్ ని వెతకడానికి వెళ్ళింది " అని సమాధానమిచ్చారు.అలా నాలుగు సంవత్సరాల పాటు విదేశాలలో పర్యటించి తిరిగి భారత దేశానికి ప్రయాణమవుతుండగా ఎంతో మంది విదేశీయులు స్వామిజి తో మేము కూడా ఇండియా కి వస్తామని హైందవ మతం లో చేరుతామని అడుగుతారు. కానీ స్వామిజి తాను వచ్చింది మత మార్పిడి కోసం కాదని, ఒక క్రైస్తవుడు మంచి క్రైస్తవుడిగా , ఒక మహ్మదీయుడు మంచి మహ్మదీయుడిగా ఉండే చాలని చెప్తారు. భగవంతుడిని చేరుకోవడానికి ఈ మతాలనేవి రకరకాల దారులని మనం ఏ దారిలో వెళ్లిన మనమందరం ఒకే చోట ఆ భగవంతుడిని కలుసుకుంటామని ఆయనచెప్పారు.

అలా ఆయన భారత దేశానికి తిరుగు ప్రయాణమయ్యారు. అప్పటికే భారతదేశంలో స్వామిజి ఘనత దశదిశలా వ్యాపించింది. 1897 లో కొలంబో కి ఆయన చేరుకోగానే ఒక మహారాజుకి లభించినంత గౌరవ మర్యాదలు లభించాయి. తాము ఎప్పటికి బానిసలమే అనే నిరాశతో నిండిపోయిన కోట్ల మంది భారతీయుల హృదయాలు స్వామి వివేకానందని చూసి ఆత్మ విశ్వాసంతో నిండిపోయాయి. ఇండియాకి వచ్చిన తరువాత నిరుపేదలకు సేవ చేయాలనే ఉద్దేశ్యంతో రామకృష్ణ మఠాన్ని స్థాపించారు. దాని ప్రధాన లక్ష్యం దేశంలోని పేద మరియు అనారోగ్య ప్రజలకు సేవలు అందించడం. ఇప్పుడు ఈ సంస్థ కేవలం మన దేశం లోనే కాదు ప్రపంచం వ్యాప్తంగా విస్తరించింది ఎన్నో పాఠశాలు ఆసుపత్రులు నిర్మించి సేవ చేస్తుంది. యువతకు మార్గనిర్దేశం చేయడంలో విశేష కృషి చేస్తోంది. ఆ తరువాత కూడా చాలా కాలం పాటు దేశమంతా పర్యటిస్తూ ప్రసంగాలు చేస్తూ, రామకృష్ణ మఠాన్ని అభివృద్ధి చేస్తూ వచ్చారు. అయితే ఆయన విశ్రాంతి లేకుండా కష్టపడం వలన ఆయన ఆరోగ్యం దెబ్బ తినడం మొదలు పెట్టింది. ఒకరోజు స్వామిజి ఆయన శిష్యులలో ఒకరిని పంచాంగ తీసుకురమ్మన్నారు. దానిలో జులై 4 తేదీ శుక్రవారం మంచి రోజుగా గుర్తించి మార్క్ చేసారు. కానీ అది దేనికో ఆ శిష్యులకు అర్ధం కాలేదు. కానీ ఆ రోజు రానే వచ్చింది 1902 సంవత్సరం జులై 4 తేదీన రాత్రి 9 గంటల సమయంలో కొంత సేపు ధ్యానం చేసుకున్నారు. తరువాత మంచం మీద పడుకుని ఆయన తన శ్వాస ని విడిచారు. అలా తాను ఏ రోజు మరణించాలో తనకు తానే ముందే ముహూర్తం పెట్టుకున్న గొప్ప యోగి ఆయన.

ఆయన కేవలం తన శరీరాన్ని అయితే వదిలారు కానీ ఆయన ఇచ్చిన స్ఫూర్తి భారతీయులలో ఎప్పటికి నిలిచేఉంటుంది. ఆయన తూర్పు మరియు పశ్చిమ సంస్కృతుల మధ్య ఒక వారధి నిర్మించారు. ఇండియాకి ప్రపంచ దేశాల్లో గౌరవం తెచ్చిన గొప్ప వ్యక్తి. ఆయన జీవితం మొత్తం మీద తనకంటూ చేసుకున్నది, దాచుకున్నది ఏది లేదు. ఆయన విదేశాలలో ఎలాంటి ముద్ర వేశారంటే ఇప్పటికి అమెరికాలో ఒక వీధికి "స్వామి వివేకానంద స్ట్రీట్" అని పేరు పెట్టుకున్నారు. మహాత్మా గాంధీ , సుభాష్ చంద్రబోస్, తిలక్, బిపిన్ చంద్ర పాల్ వంటి ఎంతోమంది స్వాతంత్ర యోధులకు వివేకానందుడే ఆదర్శం. . "మీరు ఇండియా గురించి తెలుసుకోవాలనుకుంటే స్వామి వివేకానంద గురించి చదవండి" అంటారు టాగోర్. ముఖ్యంగా యువతకోసం ఆయన ఎంతో తపించారు. భారతదేశ భవిష్యత్తుని మార్చగలిగేది యువతేనని. యువత ఒక మంచి ఆశయంతో ముందుకు వెళ్లాలని ఆయన అనేవారు. అందుకే "డబ్బు లేని వాడు కాదు జీవితంలో ఒక ఆశయం అంటూ లేని వాడు అసలైన పేదవాడు అంటారు"వివేకానంద. ఆయన ఎప్పుడు కూడా "గొర్రెలలా కాదు సింహంలా ధైరంగా బ్రతకమని" దేనికి భయపడవద్దని అంటారు.

ఇనుప కండరాలు, ఉక్కు నరాలు కలిగిన కొంతమంది యువకులను నాకు అప్పగిస్తే ఈ దేశం స్వరూపాన్నే మార్చేస్తాను" అని స్వామీజీ తరచూ అనేవారు.

మన దేశంలో యువత మనసులో స్ఫూర్తి నింపినవారిలో వివేకానంద అంతటి వారు మరొకరు లేరు. అందుకే మన దేశంలో ఆయన పుట్టినరోజు జనవరి 12 ను "నేషనల్ యూత్ డే" గా జరుపుకుంటారు. ఆయన తన ప్రసంగాలతో, సూక్తులతో పుస్తకాలతో, యువతరాన్ని ఉత్తేజపరిచి, దిశానిర్దేశం చేశారు. జీవితం నిరాశ నిస్పృహలతో నిండిపోయినప్పుడు, భయ భ్రాంతులకు గురైనపుడు, మనసు చెడు మార్గాలవైపు మళ్ళి ఏమిచెయ్యాలో దిక్కు తోచని పరిస్థితులలో ఉన్నపుడు ఒక్కసారి స్వామి వివేకానందకి సంబందించిన పుస్తకాలు, సూక్తులను చదవండి. వివేకానందుడి సందేశాలు సూటిగా మన హృదయాన్ని తాకుతాయి. మనసులో ఒక తెలియని ధైర్యం, ఆలోచనలో మార్పు కలుగుతుంది. జీవితానికి అసలైన అర్ధం తెలుస్తుంది. నిద్రానమై ఉన్న భారతజాతిని మేల్కొలిపిన ఆ మహనీయుడు, యుగ పురుషుడు ఎప్పటికి మన గుండెల్లో నిలిచే ఉంటారు.

(స్వామి వివేకానంద జయంతి (జనవరి 12) సందర్భంగా ప్రత్యేక వ్యాసం)

# డిఆర్‌యుసిసి మెంబెర్ గా గాయం వెంకట నారాయణ రెడ్డీ



అగ్నిన్యూస్,మార్కాపురం (జనవరి11)

దక్షిణ మధ్య రైల్వే గుంటూరు డివిజన్ కు సంభందించిన డివిజనల్ రైల్వే యూజర్స్ కన్సల్టేటివ్ కమిటి మెంబెర్ మెంబెర్ గా మార్కాపురం పట్టణానికి చెందిన గాయం నారాయణ రెడ్డి నియమితు లయ్యారు. ఈ వేరకు శనివారం ఒంగోలు పార్లమెంట్ సభ్యులుమాగుంట శ్రీనివాసులు రెడ్డి ఆయన కార్యాలయంలో నియామక ఉత్తర్వులు అందించారు. ఈ మేరకు గాయం నారాయణ రెడ్డి పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసరెడ్డికి, ఎమ్మెల్యే నారాయణ రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.మరో వైపు డిఆర్ యు సి సి మెంబెర్ గా ఎన్నికైన నారాయణ రెడ్డి కి కూటమి నేతలతో పాటు పార్టీ కార్యకర్తలు అభినందనలు తెలిపారు. ప్రయాణికుల సమస్యలు, వసతుల కల్పనకోసం కృషి చేస్తానని, మార్కాపురం రైల్వే స్టేషన్లో లిఫ్ట్ ప్రారంభం, డిజిటల్ కోచ్ డిస్ప్లేలాంటివి రలో యం పి ప్రారంభం చేస్తారని, అలానే పెండింగ్ పనులు,మెరుగైన రైల్వే సేవలు ప్రయాణికులకు అందే విధంగా ప్రయాణికుల సమస్యలు ఉన్నతదికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం చేసేందుకు కృషి చేస్తానని ఈ సందర్భంగా నారాయణ రెడ్డి తెలిపారు.

# రైల్వే ప్లై ఓవర్ పనులు త్వరగా ప్రారంభించాలి

## రైల్వే గతిశక్తి అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్లను కోరిన బీజేపీ నాయకులు



అగ్నిన్యూస్,గిద్దలూరు (జనవరి11)

గిద్దలూరులోని రాచర్ల గేటు వద్ద ప్లై ఓవర్ పనులను వెంటనే ప్రారంభించాలని, గిద్దలూరు బీజేపీ నాయకులు, రైల్వే గతిశక్తి అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్లను కోరారు. శనివారం వారు కంభంలో అధికారులను కలిసి రాచర్ల రైల్వే ప్లై ఓవర్ పనులను త్వరగా ప్రారంభించి,పూర్తి చేయాలని కోరారు. ప్రధాన మంత్రి గతి శక్తి ద్వారా 150 కోట్లను కేంద్రం 2023 డిసెంబర్ లో నిధులను విడుదల చేసింది కావున ప్రజల ట్రాఫిక్ సమస్యను,చిరకాల సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తిచేశారు. యం పి మాగుంట శ్రీనివాసులు రెడ్డి , ఏం ఎల్ ఎ అశోక్ రెడ్డి లు ఈ సమస్యను త్వరగా పరిష్కరించేలా దృష్టి సారించాలని కోరారు. రైల్వే గతి శక్తి అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ యం జగన్ మోహన్ రావు, అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ నంద్యాల డివిజన్ తిరుమల రావు ను కంభం లో కలసి కోరడం జరిగింది. ఈ కార్యక్రమము లో జిల్లా బీజేపీ అధికార ప్రతినిధి డాక్టర్ జె వి నారాయణ,జిల్లా ఉపాధ్యక్షులు భవనాసి వెంకట రామాంజనేయులు, గిద్దలూరు పట్టణ బీజేపీ అధ్యక్షులు అపి సెట్టి ఉదయ్ శంకర్, జిల్లా మైనార్టీ అధ్యక్షులు షేక్ ఖాదర్ వలీ షఫీ,సీనియర్ నాయకులు పళ్ళెం శ్రీనివాసులు,సీనియర్ నాయకులు బాదం మనోహర్, సీనియర్ నాయకులు సాయి రెడ్డి, కంభం బీజేపీ మండల అధ్యక్షులు బాదం కిషోర్,చెపురి శివ నాగేంద్ర, పులిపాటి మహేష్, కనమర్లపూడి బాల సుబ్బయ్య, సంజీవుల వెంకటేశ్వర్లు, సూరె చెన్నకేశవులు లు పాల్గొన్నారు.









బి సి సంఘం ఆధ్వర్యంలో ..,

# స్వాతంత్ర్య సమరయోధుడు వడ్డే ఓబన్న జయంతి



అగ్నిన్యూస్,మార్కాపురం (జనవరి11)

పట్టణంలోని బిసి భవన్‌లో శనివారం స్వాతంత్ర్య సమర యోధులు వడ్డె ఓబన్న జయంతి వేడుకలు నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించిన అనంతరం ఆయన జీవితంలో జరిగిన పలు సంఘటనలను బీసీ సంఘం నాయకులు పియల్‌పీ యాదవ్ గుర్తుచేశారు. ఆయన మాట్లాడుతూ 1945వ సంవత్సరంలో బ్రిటిష్ వారి పనుల విధానానికి వ్యతిరేకంగా ఉద్యమాన్ని నడిపినటువంటి స్వాతంత్ర సమరయోధుడు వడ్డే ఓబన్న జయంతిని శనివారం మార్కాపురం బీసీ భవన్ లో నిర్వహించారు.1846 వ సంవత్సరంలో కర్నూలు జిల్లా కోవెలకుంట్ల తహసిల్దార్ కార్యాలయం పై దాడి చేసి గ్రామస్తులు ఖజానా నిధులను పేద ప్రజలకు పంపిణీ చేశారు. దీనికి ప్రతిగా బ్రిటిష్ వారు తిరుగుబాటుదారులపై పోరు ప్రకటించారు. బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా పోరాడిన ఓబన్న అనేక యుద్ధాలలో తన పోరాటపాటలతో బ్రిటిష్ సైన్యాన్ని ఎదిరించారు. ఆయన సైన్యంలో వడ్డే, బోయ, యానాది, చెంచులు వంటి వారు భాగస్వాములుగా ఉండి బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా దండయాత్రలను చేసేవారు. 1857 సిపాయిల తిరుగుబాటు స్వాతంత్ర సమరానికి ముందు భారతదేశంలో బ్రిటీష్ పాలనకు వ్యతిరేకంగా జరిగిన ప్రతి సంఘటనలోనూ ప్రముఖ స్వాతంత్ర సమరయోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి ఆధ్వర్యంలో ముఖ్యమైన నాయకుడిగా వడ్డే ఓబన్న ఉద్యమాలు కొనసాగించాడు.

వడ్డే ఓబన్న యొక్క పోరాట పటిమను గుర్తించినటువంటి తెలుగుదేశం పార్టీ అధినేత రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వడ్డే ఓబన్న జన్మదిన వేడుకలను నిర్వహించాలని ప్రకటించడం ఎంతో గౌరవ సూచికమని పలువురు బీసీ నాయకులు తమ అభిప్రాయాన్ని వ్యక్తపరిచారు.2025 జనవరి 8వ న ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం వారు వెనుకబడిన సంక్షేమ శాఖ ద్వారా వడ్డే ఓబన్న జయంతి ఉత్సవాలను అధికారికంగా జరుపుకోవాలని నిర్ణయించడం ఆదేశం వల్ల వడ్డే ఓబన్న వారసత్వాన్ని గౌరవించేలా ఆయన త్యాగాలను సమాజం కోసం ఆయన చేసిన సేవలను గుర్తించుకోవడం జరుగుతోందని వడ్డే ఓబన్న యొక్క వీరత్వము, ధైర్య సాహసాలు, దేశభక్తి ప్రజల హృదయాలలో నిలిచి పోయాయని బీసీ సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి పిన్నిక లక్ష్మీ ప్రసాద్ యాదవ్ తెలిపారు. భారత స్వాతంత్ర ఉద్యమంలో ఒక గణనీయమైన పాత్రను పోషించిన ముఖ్యమైన వ్యక్తిగా స్వరాజ్య పోరాటంలో ఆయన చేసినటువంటి కృషికి బ్రిటిష్ పాలన వ్యతిరేకంగా సాగించిన ఉద్యమానికి అందరూ ఎంతో గౌరవించబడిందని పి ఎల్ పి యాదవ్ తెలిపారు.వడ్డే ఓబన్న జయంతిని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడానికి పూనుకోవడంతో బీసీ లందరికీ తెలుగుదేశం పార్టీ అధినేత చేసినటువంటి కృషిని అభినందిస్తూ బీసీ సంక్షేమ సంఘం జాతీయ కార్యవర్గ సభ్యులు రంగస్వామి గౌడ్ ఒక ప్రకటన చేశారు.ఈ కార్యక్రమంలో బీసీ భవన్ కమిటీ అధ్యక్షుడు గోసు సుబ్బారావు యాదవ్,రజక సంఘం నుండి రాచకొండ శ్రీనివాసులు, సూర్యబలిజ సంఘం నుండి చంద్రగిరి పురుషోత్తం, గౌడ సంఘం నుండి గజ్జ రమణ గౌడ్, కంచర్ల నాగార్జున గౌడ్, వరదాసు అంకయ్య గౌడ్, నాయి బ్రాహ్మణ సేవా సంఘం తరఫున వంకేశ్వరం శ్రీనివాసులు, రంగారావు, వాల్మీకి సేవా సంఘం తరపున మండ్ల శ్రీనివాసులు, యాదవ సంఘం తరపున మెట్ల చెంచయ్య యాదవ్, పిన్నిక చక్రపాణి యాదవ్, బత్తుల అల్లూరయ్య యాదవ్, నాగం రామకృష్ణ యాదవ్, అల్లంరాజు శ్రీనివాస్ యాదవ్ లు వడ్డే ఓబన్న చిత్రపటానికి నివాళులర్పించారు.

# బాలకృష్ణ ఫ్యాన్స్ ధర్నా



అగ్నిన్యూస్,మార్కాపురం(జనవరి 11)

పట్టణంలో బాలకృష్ణ ఫాన్స్ అసోసియేషన్ సభ్యులు శనివారం శ్రీనివాస థియేటర్ ముందు ధర్నాకు దిగారు.డాకు మహారాజ్ సినిమాపై ఇప్పటి వరకు స్పష్టత లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.థియేటర్ యజమానులు సిండికేట్ గా మారాయని ఫాన్స్ ఆవేదన వ్యక్తం చేశారు. కొందరు కావాలనే ఇలా చేస్తున్నారని వారు ఆరోపించారు.


Printed, Published and owned by K.V.Ramanarao APTEL 0548\01\1997 SV Printers Markapur. (K.Rama Krishna . 9441533080|8309890844)